క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నాయకుడికి తుది వీడ్కోలు



వెంకటరెడ్డి అంతిమయాత్రలో పాల్గొన్న వైవీ భద్రారెడ్డి, తదితరులు

మేదరమెట్ల: కొరిశపాడు మండలంలోని పమిడిపాడు పంచాయితీ పరిధిలోని కృష్ణంరాజువారిపాలెం (రెడ్డి పాలెం) గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, పమిడిపాడు సొసైటీ మాజీ అధ్యక్షుడు కేసరి వెంకటరెడ్డి మంగళవారం మృతిచెందారు. ఏఎంసీ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు వైవీ భద్రారెడ్డి బుధవారం వెంకటరెడ్డి భౌతిక కాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే వెంకటరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వైవీ వెంట నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, మండల, గ్రామ నాయకులు ఉన్నారు.

కుంభాభిషేక కార్యక్రమానికి అంకురార్పణ



రుత్వికులకు నూతన వస్త్రాలు అందజేస్తున్న ఏసీ తిమ్మనాయుడు

అద్దంకి రూరల్: ప్రముఖ పుణ్యక్షేత్రమైన శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థాన ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ వరకు జరగనున్న కుంభాభిషకం కార్యక్రమానికి బుధవారం అంకురార్పణ చేశారు. దీనిలో భాగంగా దేవస్థాన ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక హోమగుండాల్లో హోమాలు ప్రారంభించారు. హోమాలు నిర్వహించడానికి విచ్చేసిన రుత్వికులకు, దేవస్థాన అర్చకులకు దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎం. తిమ్మనాయుడు నూతన వస్త్రాలు అందజేశారు.

అర్జీల విచారణ సత్వరం చేయాలి


చీరాల టౌన్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను నిర్ణీత సమయంలోగా విచారించి పరిష్కరించాలని తహశీల్దార్ కుర్రా గోపికృష్ణ సూచించారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయంలో గ్రామ, పట్టణ వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. గ్రామాలు, సచివాలయాల పరిధిలో పెండింగ్‌లో ఉన్న అర్జీలు, పాసు పుస్తకాలు, స్పందన అర్జీలపై సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. గ్రామాల్లో, సచివాలయాల్లో పనిచేసే వీఆర్వోలు ప్రజలకు అందుబాటులో ఉండటంతో పాటు స్పందన అర్జీలను త్వరగా విచారించాలన్నారు. ప్రజలకు జవాబుదారీతనంగా రెవెన్యూ ఉద్యోగులు పని చేయాలని, విధుల్లో అలసత్వం వహించిన వారిపై శాఖా పరమైన చర్యలు తప్పవన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డీటీ ప్రసన్న, ఆర్ఐలు శేఖర్, సత్యం, వీఆర్వోలు ఉన్నారు.

నేటి నుంచి పర్చూరులో రామనామ సప్తాహం



పర్చూరు(చినగంజాం): పర్చూరు వేణుగోపాల స్వామి ఆలయంలో రామనామ సప్తాహం గురువారం నుంచి ప్రారంభం అవుతుందని ఆలయ కార్యనిర్వాహణాధికారి దామా నాగేశ్వరరావు ఆలయ ధర్మకర్త రావువారి వెంకట శివప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి వారం రోజుల పాటు ఉదయం 7 గంటల నుంచి హరేరామ నామ సప్తాహం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 22వ తేదీ హనుమ జయంతి సందర్భంగా పూర్ణాహుతి కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. అనంతరం 108 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం ఉంటుందని వివరించారు.

నీటి పన్ను వసూళ్ల వేగం తప్పనిసరి



పర్చూరు(చినగంజాం): నీటి పన్ను వసూలును వేగవంతం చేయాలని బాపట్ల ఆర్డీఓ గ్లోరియా అధికారులను ఆదేశించారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఆమె అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భూముల రీసర్వేని వెంటనే పూర్తి చేయాలన్నారు. మండలంలోని రమణాయపాలెం, వీరన్నపాలెం గ్రామాల్లో జరిగిన భూముల రీసర్వే గురించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. రీ సర్వే రైతుల సమక్షంలోనే చేయాలని ఆమె అధికారులకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పీ బ్రహ్మయ్య, డీఎ శ్రీనివాసరావు, సర్వేయర్‌లు, పాల్గొన్నారు.

పంట వ్యర్థాల దగ్ధం.. భూమికి అనర్థం

- పంటల అవశేషాలే మలి పంటలకు బలం
- పర్యావరణానికి సైతం పెను విఘాతం
- మండలంలో పలు చోట్ల పంట వ్యర్థాలను తగులబెడుతున్న రైతన్నలు



వేరుశనగ ఆకును చేలోనే తగులబెట్టిన రైతు

వేటపాలెం: భూమిని రైతులు ప్రేమించినంతగా మరెవ్వరూ ప్రేమించలేరనేది వాస్తవం. తమకు జీవనాధారమైన పుడమి తల్లిని నమ్ముకొని పంటలు సాగుచేసి, దిగుబడులను అమ్ముకొని కుటుంబాలను పోషించుకోవడం మాత్రమే వారికి తెలుసు. ప్రకృతి వైపరీత్యాలు, వెరసి వారి ఆలోచన విధానంలో కూడా మార్పులు వస్తున్నాయి. ఒకప్పుడు పంట అవశేషాలను కలియదున్నడం ద్వారా అవశేషాలను ఎరువుగా మార్చుకొని సేంద్రియ వ్యవసాయ విధానం ద్వారా మంచి దిగుబడులు సాధించిన రైతులు ప్రస్తుతం మాత్రం అందుకు పూర్తి భిన్నంగా వాటిని దగ్ధం చేయడం ద్వారా పలు విధాలుగా నష్టపోతున్నారు. వేసవిలో రైతులు పొలాలను దుక్కిదున్నుతుంటారు. ఈనేపథ్యంలో పంట తాలూకు అవశేషాలను తగులబెడుతుంటారు. తెగుళ్లు అధికంగా ఆశిస్తుండటంతో వాటి నివారణ కోసం రసాయన ఎరువులు విరివిగా వినియోగించడం వల్ల వీటిని కలియదున్నితే ఆ దుష్ప్రభావం తదుపరి పంటలపై ఉండదనేది రైతుల భావన. తద్వారా వాటిని తగులబెడితే, తెగుళ్లకు కారణమయ్యే బాక్టీరియా నశిస్తుందనే ఆలోచనలో ఉన్నారు. మరికొందరు త్వరితగతిన మరో పంట వేసుకునేందుకు వీలుగా అవశేషాలను తగులబెడుతున్నారు. అయితే దీనివల్ల లాభం లేకపోగా, నష్టం అధికంగా ఉంటుందని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు.

అనర్థాలు అనేకం..

గతంలో పంట కాలం పూర్తయిన పిదప రైతులు పంటల అవశేషాలను అలాగే ఉంచేవారు. మళ్లీ సాగు తరుణంలో వాటిని కలియ దున్నేవారు. అయితే ప్రస్తుతం అందుకు భిన్నంగా వాటి అవశేషాలను కాల్చేస్తున్నారు. వరి, వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటల కాలం పూర్తయిన వెంటనే మరో పంట కోసం వాటి అవశేషాలను తగులబెట్టడం ఇటీవల పరిపాటిగా మారింది. ఈ ప్రక్రియ సులభమే అయినప్పటికీ ఎటువంటి లాభం లేకపోగా నష్టం మాత్రం తీవ్రంగా ఉంటుందని వ్యవసాయ శాఖాధికారులు, పర్యావరణవేత్తలు హెచ్చరికలు జారీ చేస్తున్నారు. పంట అవశేషాలను దగ్ధం చేయడం ద్వారా పర్యావరణానికి పెను విఘాతం కలుగుతుందని, అదేవిధంగా పంటలకు మేలు చేసే ఎరలు, ఇతర సూక్ష్మక్రిములు పూర్తిగా నశిస్తాయని వ్యవసాయధికారులు చెప్తున్నారు. తద్వారా భూమి నిస్సారమవుతుందని, ఫలితంగా ఎంత పెట్టుబడులు పెట్టినా ప్రయోజనం ఉండదని, పంటల అవశేషాలను కాల్చడం ద్వారా భూమితోపాటు పర్యావరణానికి సైతం హాని కలిగించినట్లవుతుందని అధికారులు సూచిస్తున్నారు.

రైతులు పాటించాల్సిన సూచనలు..

అవశేషాలు తగులబెట్టడానికి బదులు భూమిలో మురగబెట్టి దక్కిలో కలిపి దున్నడం ద్వారా ప్రయోజనం ఉంటుంది. వరి మొక్కను కింద వరకు కోసి గడ్డి కింద ఉపయోగించుకోవచ్చు. అవశేషాలను దుక్కిల కలిపి దున్నడం ద్వారా సేంద్రియ కర్బనం పెరిగి పంటకు మేలు చేగూరుతుంది. వేరుశనగ పంటను మిషన్‌లో వేసి నుజ్జు చేయకుండా పశుగ్రాసం కింద ఉపయోగించుకోవచ్చు. వరి పోలాల్లో రోటోవేటర్ ద్వారా కలియదున్నితే పోషకాలు మొక్కలు అందుబాటులో ఉంటాయి.

పంట వ్యర్థాలతో భూమి సారవంతం..



సాగు అనంతరం పంట వ్యర్థాలను భూమిలో కలియ దున్నడం వల్ల అది భూమికి సారవంతంగా ఉపయోగ పడుతుంది. ఈ వ్యర్థాలు వర్మీ కంపోస్టులాగా భూమికి ఉపయోగపడి ఎరువులాగా అందిస్తాయి. కాని కొందరు రైతులు వేసవిలో పంట వ్యర్థాలను తగలబెడుతున్నారు. అలా చేయకూడదు, దీని వల్ల భూసారం, మేలు చేసే సూక్ష్మక్రిములు చనిపోతాయి.

– కాశీవిశ్వనాథ్, ఏవో, వేటపాలెం

అన్నదానంలోనే మహా సంతృప్తి

- దాతల సహకారంతో ఆలయాల్లో అన్నదానం
- సంతోషం వ్యక్తం చేస్తున్న భక్తులు



పేదలకు అన్నదానం చేస్తున్న మహిళా భక్తులు, ఆలయ కమిటీ



అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భోజనం చేస్తున్న పేదలు

చినగజాం: అన్ని దానాల్లో కెల్లా అన్నదానం గొప్పది. హిందూ ధర్మంలో అన్నదానానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఆకలితో ఉన్నజీవికి ఆహారం అందించడం కన్నా మంచి పూజ లేదా ఆచారం లేదని భావన. అన్నదానం అనేది సనాతన సంప్రదాయాల్లో ముఖ్యమైన భాగంగా ఉంది. దాతలందిస్తున్న సహకారంతో మండల కేంద్రమైన చినగంజాంలో పలు దేవాలయాల్లో అన్నదాన కార్యక్రమాన్ని విరివిగా నిర్వహిస్తున్నారు. స్థానిక భావన్నారాయణ స్వామి ఆలయంలో ప్రతి బుధవారం పేదలకు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తూ భక్తులు తరిస్తున్నారు. గడచిన ఐదేళ్లగా భావన్నారాయణ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వలివేటి శివనారాయణ ఆధ్వర్యంలో పలువురు మహిళా భక్తులు ఆలయంలోనే వంటలు వండి రుచికరమైన కూరలు తమ స్వహస్తాలతో తయారు చేసి పేదలకు ప్రతి బుధవారం భోజనం అందిస్తున్నారు.

50 మందికి భోజనం..

స్థానికంగా ఉన్న మహిళా భక్తులు ఎటువంటి లాభాపేక్ష లేకుండా వారే స్వయంగా ఆర్థిక వనరులు సమకూరుస్తూ భోజనానికి కావాల్సిన అన్ని రకాలు వస్తువులను సమకూర్చి వారంలో ఒకరోజు సుమారు 50 మందికి భోజనం తయారు చేసి అందజేస్తున్నారు. చినగంజాం గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాలకు చెందిన పలువురు మహిళా భక్తులు ఈ మహత్కార్యంలో పాలుపంచుకొని తరిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు మాచవరపు పార్వతి, మాణిక్యం, సుకన్య, జానకమ్మ తదితరులు ఉన్నారు. దాతల సహకారంతో నిత్యాన్నదాన కార్యక్రమంగా కొనసాగించేందుకు చర్యలు తీసుకుంటామని ఆలయ కమిటీ వారంటున్నారు. భావన్నారాయణస్వామి ఆలయంతో పాటు షిరిడి సాయిబాబా మందిరంలో గురువారం, గంగాపార్వతీ సమేత చిదంబరేశ్వర స్వామి ఆలయంలో సోమవారం భక్తులు స్వయంగా భోజనం తయారు చేసి భక్తులకు అందజేస్తున్నారు. వీరు చేస్తున్న నిస్వార్థ సేవ పట్ల పలువురు వారికి అభినందనలు తెలియజేయడంతో పాటు ఆర్థికంగా సాయమందిస్తూ మహాదాన కార్యక్రమాన్ని ముందుకు నడిపించేందుకు సహకరిస్తున్నారు.

అర్హత కలిగిన కౌలు రైతులకు కార్డులు



కారంచేడులో కౌలు రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ నాగరాజు



అవగాహన కలిగిస్తున్న పర్చూరు తహసీల్దార్ బ్రహ్మయ్య

కారంచేడు: గ్రామాల్లోని రైతులు, కౌలు రైతులు సాగుహక్కు పత్రాలపై సరైన అవగాహన కలిగి ఉండాలని తహసీల్దారు జీ నాగరాజు అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రం కారంచేడు గ్రామంలో వ్యవసాయ, రెవెన్యూ శాఖల సంయుక్త సహకారంతో సచివాలయం–2 వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కౌలు రైతులు తప్పకుండా గుర్తింపు కార్డులను తీసుకోవాలన్నారు. ఇవి తీసుకోవడం వలన ప్రభుత్వం కౌలు రైతులకు అందించే అన్ని రకాల సర్వీసులు సకాలంలో అందుతాయన్నారు. కౌలు కార్డులున్న వారికి ప్రకృతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతుల బీమా, వ్యవసాయ రుణాలు వంటి అనేక పథకాలకు అర్హులవుతారన్నారు. గ్రామాల్లో వీఆర్ ఓలు, వ్యవసాయ సహాయకుల చేతుల మీదగా కౌలు కార్డులు అందిస్తామన్నారు. కార్యక్రమంలో అర్జీలు పెట్టుకున్న కౌలుదారులకు ఆయన కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ కే సుధీర్ బాబు, ఆర్ఐ జగదీష్, వీఆర్ఓ కోటేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు జ్యోతి, భవానీ, లలిత, రైతులు పాల్గొన్నారు.

రుణ అర్హత కార్డుల కోసం అర్జీలు

పర్చూరు(చినగంజాం): రైతులు రుణ అర్హత కార్డుల కోసం అర్జీలు అందజేయాలని తహసీల్దార్ పీ బ్రహ్మయ్య అన్నారు. బుధవారం మండలంలోని గర్నెపూడి, ఇనగల్లు గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామ సభలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. రుణ అర్హత కార్డుల గురించి రైతులకు అవగాహన కల్పించారు. పర్చూరు మండలానికి కౌలు రైతుల కోసం 3650 రుణ అర్హత కార్డులు మంజూరైనట్లు ఆయన వివరించారు. గ్రామ సభలకు రైతులు హాజరై కార్డులు కోసం అర్జీలు అందజేసి అర్హత కలిగిన ప్రతి రైతు పొందాలని ఆయన సూచించారు. పలువురు కౌలు రైతుల నుంచి ఆయన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో వీఆర్వోలు అనూష, నవ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరం



తనిఖీలపై వివరాలను వెల్లడిస్తున్న విద్యుత్‌శాఖ అధికారులు

చీరాల అర్బన్: విద్యుత్ చౌర్యం చట్టరీత్యా నేరమని విద్యుత్ డీఈఈ జాన్‌థామస్ అన్నారు. బుధవారం చీరాల రూరల్ సెక్షన్ పరిధిలోని పలు గ్రామాల్లో విద్యుత్‌శాఖ విజిలెన్స్ విభాగం, విద్యుత్‌శాఖ సిబ్బంది సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఉషారాణి, డిఈఈ జాన్‌థామస్ నేతృత్వంలో 35 బృందాలు ఏర్పడి 2263 సర్వీసులను పరిశీలించారు. అందులో అక్రమంగా విద్యుత్‌ను చౌర్యం చేస్తున్న 16 మందికి రూ.29,100 అపరాధ రుసుము విధించారు. అలానే అనుమతికి మించి విద్యుత్‌ను వినియోగిస్తున్న 342 మందికి రూ.12.38 లక్షల అపరాధ రుసుము విధించారు. విద్యుత్ చౌర్యం సామాజిక నేరమన్నారు. కార్యక్రమంలో ఏడీఈఈలు బి.హరి ప్రసాద్, పి.శ్రీనివాసరావు, జే.శ్రీనివాసులు, ఏఈలు పాల్గొన్నారు.

రేపు ఎస్ఎల్‌గుడిపాడులో గ్రామ సభ

బల్లికురవ: మండలంలోని ఎస్ఎల్ గుడిపాడు గ్రామంలో శుక్రవారం ఉదయం 10.30 గంటలకు గ్రామసభ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుడిపాడు గ్రామ పరిధిలో సోలార్ పవర్ ప్రాజెక్టు మంజూరైనందున గ్రామస్తులకు అవగాహన కల్పించేందుకు సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. చీరాల ఆర్డీవో చంద్రశేఖర్‌నాయుడు ముఖ్య అతిథిగా హాజరవుతారని ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు విధిగా హాజరుకావాలని తహసీల్దార్ కోరారు.

చందలూరులో నేత్రదానం



విజయసారథి (ఫైల్)

ఇంకొల్లు(చినగంజాం): చందలూరు గ్రామానికి చెందిన చిట్టాబత్తిన విజయసారథి (82) మృతి చెందడంతో ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు స్వచ్ఛందంగా దానం చేశారు. ఇంకొల్లు రోటరీ అవయవదాన కమిటీ ఆధ్వర్యంలో శంకర కంటి ఆసుపత్రి వైద్యులు దాత కార్నియాలను సేకరించారు. కార్యక్రమంలో కుమారులు శేష గిరిరావు, మురళీకృష్ణ, కుమార్తె కరి భువనేశ్వరి, అల్లుడు రామాంజనేయులు పాల్గొన్నారు. అవయవదాన కమిటీ సభ్యులు సోమేపల్లి రామ్మోహనరావు, జెట్టి వెంకటేశ్వర్లు, అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ ఎస్కే రఫీ, చుండి సాంబశివరావు, మాజీ జెడ్పీటీసీ కరి సుబ్బారావు, కరి కమలేశ్వరరావులు దాత బంధుమిత్రులు, కుటుంబ సభ్యులను అభినందించారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

చీరాల టౌన్: గ్రామీణ ప్రాంతాల్లోని వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యురాలు శ్రీదేవి సూచించారు. బుధవారం మండలంలోని ఈపూరుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పీహెచ్‌సీ పరిధిలోని 14 సబ్ సెంటర్లలో వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఎండలు అధికంగా కాస్తున్నందున గ్రామాల్లోని చిన్నపిల్లలు, వృద్ధులు అనారోగ్యాలకు గురికాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. చిన్నపిల్లలకు, గర్భిణులకు అందించే వ్యాక్సిన్లను క్రమం తప్పకుండా వేయాలన్నారు. సమావేశంలో సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉద్యోగులు ఆరోగ్యంపై దృష్టి సారించాలి



ఉద్యోగులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ వినయ్

కారంచేడు: ప్రభుత్వ ఉద్యోగులు పని ఒత్తిడితో కాకుండా తమ ఆరోగ్య విషయాలపై ప్రత్యేక దృష్టి ఉంచుకోవాలని ఎంపీడీఓ కే నేతాజీ అన్నారు. బుధవారం ఆయన స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. జిల్లా పరిషత్ సీఈఓ ఆదేశాల మేరకు నిజాం ఫిజియోథెరపీ ఇన్‌స్టిట్యూషన్ ఆధ్వర్యంలో డాక్టర్ వినయ్ అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ శారీరక వ్యాయామం చేసుకోవాలన్నారు. వీటితో పాటు తీసుకోవాల్సిన ఆహార నియమాల్లోను అవగాహన ఉండాలన్నారు. శరీర బలహీతలతో ఇబ్బందులు పడేవారు తప్పకుండా ఫిజియోథెరపీని నిర్వహించుకోవాలన్నారు. వైద్యుల సూచనలు, సలహాలతోనే ముందుకు వెళ్లాలన్నారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ బసవరాణి, ఉపాధి ఉద్యోగులు, కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు, మహిళా పోలీసులు, వెల్ఫేర్ అసిస్టెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన ప్రతిష్ఠలు, కల్యాణోత్సవం



ప్రతిష్ఠించిన నాగమయ్య, నాగమ్మ విగ్రహాలు



గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ విగ్రహాలకు కల్యాణోత్సవం

బల్లికురవ: మండలంలోని కొణిదెన గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో బుధవారం ఉదయం 6.55 గంటలకు నాగప్రతిష్ఠ, బ్రహ్మంగారి కల్యాణం కనులపండువగా నిర్వహించారు. అర్చకులు అద్దంకి శ్రీనివాసచారి, నాగబ్రహ్మచారి బృందంచే గణపతి పూజ పుణ్యాహవచనం, దీక్షా బంధన, నవనాగ మండపారాధన, ప్రధాన కలశస్థాపన తదుపరి పంచాదివాసాలో ఉంచిన నాగమయ్య, నాగమ్మ విగ్రహాలకు వేద మంత్రోచ్ఛరణలతో ప్రతిష్ఠించారు. అనంతరం గోవిందమాంబ సమేత వీరబ్రహ్మేంద్రస్వామి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి వేదికపై ఉంచి సుమారు 3 గంటలపాటు కల్యాణోత్సవ తంతు పూర్తి చేశారు. ఈ వేడుకల్లో గ్రామంతోపాటు పరిసర గ్రామాల్లోని భక్తులు పాల్గొన్నారు. రాత్రికి ప్రత్యేక పూజలు, హారతులు నివేదనల తదుపరి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేపట్టారు.

స్వయం సంఘాలు ఆర్థిక వృద్ధి సాధించాలి

చీరాల టౌన్: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అందిస్తున్న రుణాలను సక్రమంగా వినియోగించుకోవడంతో పాటుగా మొబైల్ బుక్ కీపింగ్‌ను నిర్వహించాలని వెలుగు ఏపీఎం కె.మధుసూదన్‌రావు సూచించారు. బుధవారం మండలంలోని బుర్లవారిపాలెంలోని స్త్రీశక్తి భవన్‌లో మండల సమాఖ్య సభ్యులతో ఏపీఎం సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. పొదుపు సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను సద్వినియోగం చేసుకుని, వివిధ వ్యాపారాలు, సూక్ష్మ పరిశ్రమలు ఏర్పాటు చేసుకున్న సభ్యుల జీవనోపాధి పెంచేలా పొదుపు సంఘాల వీఏవోలు చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి గూపు విధిగా ప్రతినెల 10 తేదీ సమావేశాన్ని నిర్వహించుకుని గ్రూప్‌ల మొబైల్ కీపింగ్‌ను 100 శాతం పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మండల సమాఖ్య ప్రతినిధులు, వీఓఏలు పాల్గొన్నారు.

చదువు విజ్ఞానాన్ని పెంపొందిస్తుంది



కారంచేడు గ్రంథాలయంలో పుస్తక పఠనంలో చిన్నారులు



పర్చూరు: సమావేశంలో మాట్లాడుతున్న ఐసీడీఎస్ జేడీ జయలక్ష్మి

కారంచేడు: గ్రంథాలయాల్లోని పుస్తకాలు చదవడం వలన ప్రపంచ వ్యాప్తంగా మన జీవన శైలిపై అవగాహన, విజ్ఞానాన్ని పెంపొందిస్తుందని గ్రంథపాలకుడు నాగయ్య అన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రమైన కారంచేడు చెరువు కట్టమీద ఉన్న ప్రభుత్వ గ్రంథాలయంలో విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి తెలివితేటలను పరిశీలించేలా వారికి పరీక్షలు నిర్వహించారు. ప్రతిరోజు పుస్తకాలు, దినపత్రికలు చదవడం వలన మన దేశ సంస్కృతి, సంప్రదాయలపైన కూడా అవగాహన కలిగి ఉంటారన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్ట విరుద్ధం..

పర్చూరు(చినగంజాం): బాల్య వివాహాలు చట్ట విరుద్ధమని వాటి వలన అనేక అనర్థాలు కలుగుతాయని ఐసీడీఎస్ రీజనల్ జాయింట్ డైరక్టర్ జయలక్ష్మి అన్నారు. బుధవారం పర్చూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని కార్యాలయాన్ని ఆమె సందర్శించారు. సీడీపీఓ సుభద్ర, సూపర్‌వైజర్‌లతో ఆమె సమావేశం నిర్వహించారు. అంగన్‌వాడీ కేంద్రాల పనితీరు గురించి ఆమె చర్చించారు. అనంతరం పర్చూరులోని ఐదు అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహిస్తున్న కిషోరి వికాస్ సమ్మర్ క్యాంప్ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీడీపీఓ సుభద్రతోపాటు సూపర్ వైజర్‌లు పీ దీపాదేవి, ఎం అన్నపూర్ణ, ఎంఎస్ కే యోగేశ్వరి, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళపై కర్రలతో దాడి

అద్దంకిరూరల్: ఇంటి ముందున్న మురుగు కాలువ శుభ్రం చేస్తున్న మహిళపై పక్కింటి వాళ్లు మురుగు తన ఇంటిముందుకు వస్తున్నాయని కర్రలతో దాడిచేశారు. ఈ ఘటన బుధవారం మండలంలోని ధర్మవరం గ్రామంలో చోటుచేసుకుంది. వైద్యశాలలో చికిత్స పొందుతూ క్షతగాత్రుల ఫిర్యాది మేరకు సీఐ సుబ్బరాజు కేసు నమోదు చేశారు. సీఐ వివరాల మేరకు.. గ్రామానికి చెందిన యద్దనపూడి తలమ్మ తన ఇంటిముందున్న మురుగు కాలువలోని చెత్త తొలగిస్తుండగా ఇంటి పక్కన ఉన్న మారం సుబ్బారెడ్డి మా ఇంటి ముందు మురుగు చేరుతుందని మహిళపై కర్రతో దాడి చేశాడు. దీంతో తలమ్మ పెద్దగా కేకలు వేయటంతో ఆమె చిన్న కుమారుడు బయటకు రావటంతో సుబ్బారెడ్డి ఇద్దరు కుమారులు ఆమె చిన్నకుమారుడిపై దాడికి దిగారు. ఆమె కుమారుడికి తలకు గాయాలయ్యాయి. స్థానికులు ఇరువురిని అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు.